క్లుప్తంగా

మంత్రితో కాసుల భేటీ



బాన్సువాడ: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో శుక్రవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని అగ్రి డాక్టర్స్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రిని ఈ సందర్భంగా కాసుల బాల్‌రాజ్ సన్మానించారు. ఈ సందర్భంగా కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. అగ్రి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన గొండ సురేందర్ గత సంవత్సరం పిట్లం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య అంజమని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న 2006–07(10వ తరగతి)లో పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న స్నేహితులు శుక్రవారం అందరు కలిసి ఆమెకు రూ.27 వేల ఆర్థిక సాయం అందజేశారు. బోడి మల్లికార్జున్, బోందిలి గోపాల్, కుమ్మరి యదు, గొర్రె పండరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాల శాంపిళ్ల సేకరణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల నుంచి మొక్కజొన్న విత్తనాల శాంపిళ్లను ఏడీఏ అపర్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శుక్రవారం సేకరించారు. మొక్కజొన్న సరిగ్గా మొలకెత్తలేదని పలువురు రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయడంతో శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఏడీఏ తెలిపారు.

మొలకెత్తని పంట పరిశీలన

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామంలో సరిగ్గా మొలకెత్తని మొక్కజొన్న పంటను ఏడీఏ అపర్ణ, ఏవో పవన్, ఏఈవో వినోద్‌గౌడ్‌లు శుక్రవారం పరిశీలించారు. తాను కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తనాలను తన చేనులో నాటితే అవి సరిగా మొలకెత్తలేదని తిప్పాపూర్ గ్రామానికి చెందిన వంగేటి రాజారాం నర్సారెడ్డి వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయాధికారులు గ్రామానికి వచ్చి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని ఏడీఏ అపర్ణ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

బీబీపేట: మండల కేంద్రంతో పాటు తుజాల్‌పూర్ గ్రామంలో పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌తో పాటు ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్‌లు పరిశీలించారు. మురికి కాలువల శుభ్రంగా ఉంచాలని, అదే విధంగా పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామంలోని ప్రతి కాలనీలో ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శులు రమేష్, రాజశేఖర్ ఉన్నారు.

ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయికి ఎంపిక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల స్థాయిలో నిర్వహించిన ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులో మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకట రమణ తెలిపారు. జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులో గురుకుల పాఠశాల విభాగంలో మోడల్ స్కూల్‌కు చెందిన అశ్విని, శ్రీజ, జెడ్పీ పాఠశాలకు చెందిన విభాగంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మహవీర్, తరుణిలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు భూమయ్య, సుమన్ తదితరులున్నారు.

'అంగన్‌వాడీ'కి కుర్చీల వితరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేట అంగన్‌వాడి కేంద్రానికి తండాకు చెందిన బానోత్ నరేష్ నాయక్ శుక్రవారం కుర్చీలు వితరణ చేశారు. సావిత్రిబాయి పూలె జయంతి సందర్భంగా కుర్చీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తండా వాసులు బన్సీలాల్, గణేష్, వేణుసింగ్, మంజు, సురేందర్, పురుషోత్తం, ఉపాధ్యాయులు అనూష్‌బాయి, శాతాబాయి, సావిత్రి, కైక తదితరులు పాల్గొన్నారు.

కౌమార విద్యార్థులకు క్విజ్ పోటీలు

మాచారెడ్డి: మండలంలోని ఫరీదుపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం వర్ధ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమార దశ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గతంలో బోధించిన అంశాలపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం రాంమనోహర్ రావు, వర్ధ సంస్థ ప్రతినిధులు వంశీకృష్ణ, శ్రీవిద్య ఉన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

మద్నూర్(జుక్కల్): విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండుతున్న వంటలను పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

సాక్షి నెట్‌వర్క్ : సామాజిక సంఘ సంస్కర్త, కవయిత్రి, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలె జయంతిని వివిధ సంఘాలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భారత దేశంలో మహిళల హక్కులను కాపాడటంతో ఆమె కీలకపాత్ర పోషించారని అన్నారు. స్త్రీవాద ఉద్యమానికి ఆమె మార్గదర్శకురాలిగా వ్యవహరించారని పేర్కొన్నారు. నేటి తరం యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అణగారిన వర్గాల మహిళలు చదువుకోవడానికి ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఉన్నతాధికారులు, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.



ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో వెంకటేశం



జిల్లా గ్రంథాలయ సంస్థలో నివాళులర్పిస్తున్న చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పాఠకులు



కామారెడ్డి అర్బన్: డెయిరీ టెక్నాలజీ కళాశాలలో..



పిట్లంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో..



పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



రాజంపేట మండల పరిషత్ కార్యాలయంలో ..



సీతారాంపూర్ పాఠశాలలో..



నాచుపల్లి మినీ గురుకులంలో ..



బీబీపేట కేజీబీవీలో..



బిచ్కుందలో.. కాంగ్రెస్ నేతలు



రాజంపేట మండల పరిషత్ కార్యాలయంలో..



బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



బేగంపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో..



దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు సన్మానం



పెద్దమల్లారెడ్డి దళితవాడ పాఠశాలలో..



గౌరారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



మద్నూర్ గురుకులంలో..



మాచారెడ్డిలో..

రోడ్డు ప్రమాదాల బారిన పడొద్దు



అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖాధికారిణి



రోడ్డు భద్రత నిబంధనలకు సంబంధించిన కరపత్రాలతో విద్యార్థులు, అధికారులు

మద్నూర్(జుక్కల్): రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీవో అధికారులు రజిని, గంగామణి సూచించారు. మండల కేంద్రంలోని వాసవి హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని అన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉమాకాంత్, డైరెక్టర్ శశికాంత్, ప్రిన్స్‌పాల్ వినోద్‌కుమార్, స్నేహ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

జిల్లా కేంద్రంలోని విద్యానికేతన్‌లో..

కామారెడ్డి క్రైం: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై వివరించారు. డీటీవో శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ అధికారులు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన టోల్‌ప్లాజా సిబ్బందిని కఠినంగా శిక్షించాలి



భిక్కనూరు: అదనపు కలెక్టర్ సీసీ రాజశేఖర్‌పై దాడి చేసిన భిక్కనూరు టోల్‌ప్లాజా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారుల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుభాషి మాణిక్యం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. కలెక్టర్ సీసీని దుర్భాషలాడి దాడి చేసిన టోల్‌ప్లాజా సిబ్బంది సామాన్యుల పట్ల ఏవిధంగా ప్రవర్తిస్తారో పోలీసులు అర్థం చేసుకోవాలన్నారు. టోల్‌ప్లాజా సిబ్బంది వాహనదారుల పట్ల మర్యాదగా మెదిలే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బేషరతుగా వారు క్షమాపణ చెప్పాలన్నారు.

సమ్మె నోటీసు అందజేత



బాన్సువాడ: సమ్మె నోటీసును శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజుకు మున్సిపల్ కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా కార్మికుల గురించి పట్టించుకోవడం లేదని, కార్మికుల సమస్యలపై ఈ నెల 4, 5 తేదీల్లో కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు, 6న జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్మికులు బుజ్జిగారి సాయిలు, రాజు, పిట్లం సాయిలు, కంప్యూటర్ ఆపరేటర్ వెంకట్ తదితరులున్నారు.

మోకాళ్లపై నిలబడి హమాలీల నిరసన



జిల్లా కేంద్రంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న హమాలీలు



ఎల్లారెడ్డిలో..

కామారెడ్డి టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లయ్ హమాలీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 3వ రోజుకు చేరుకుంది. ఆర్డీవో కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం పెంచిన హమాలీల ఎగుమతి, దిగుమతి కూలీల రేట్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నర్సింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఉపాధ్యక్షుడు దశరత్, హమాలీలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో హమాలీల సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. గోదాం ముందు హమాలీలు సమ్మె కొనసాగిస్తున్నారు. హమాలీ సంఘం నాయకులు సాయిలు, కాశీరాం, రవి తదితరులున్నారు.

సంక్షిప్తం

41వ వార్డులో బోరు మోటారు ప్రారంభం

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 41వ వార్డు పంచముఖి హనుమాన్ కాలనీలో నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు కౌన్సిలర్ రాజమణి, కాలనీవాసులు ఉన్నారు.

కస్తూర్బాలో వైద్య శిబిరం

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మందులు అందజేశారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిగా శ్రీకాంత్



మద్నూర్(జుక్కల్): మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి పదవీ విరమణ పొందడంతో పిట్లం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఉన్న శ్రీకాంత్‌కు మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ సిబ్బంది చందర్, సత్యం, రాజేశ్ ఉన్నారు.

'కాంట్రాక్టు అధ్యాపకులకు పేస్కేలు ఇవ్వాలి'



భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు వెంటనే యూజీసీ పేస్కేలును ఇవ్వాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. శుక్రవారం సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లో 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, వీరందరికి ఉద్యోగ భద్రతతో కూడిన బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో పాటు మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు.

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు పర్యవేక్షణ అధికారాలు కల్పించాలి

కామారెడ్డి అర్బన్: ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల జీతభత్యాలకు సంబంధించి పే సెంటర్‌ను ఏర్పాటు చేసి డీడీవో అధికారాలు కల్పించాలని, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ అధికారాలను సీనియర్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు బదలాయించి పర్యవేక్షణ అధికారాలు ఇవ్వాలని ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ డీఈవోకు విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్ కుమార్, రాజేష్‌లు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి అర్బన్: టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఆవిష్కరించారు. ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను డీఈవో రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా అసోసియేషన్ల జిల్లా నాయకులు ఆకుల బాబు, సాయిలు, ఇందూరి రమేష్ కుమార్ గౌడ్, పందిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్) : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పీఆర్‌టీయూటీఎస్ పిట్లం మండల శాఖ నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు బన్సీలాల్, ప్రధాన కార్యదర్శి నారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీమాణిక్ రావు, రవీందర్ జెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రమోద్ కుమార్, నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పిట్లంలో.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన ఉండాలి



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



బీర్కూర్‌లో వంట సరుకులను పరిశీలిస్తూ..

● బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం బోర్లం సాంఘిక సంక్షేమ పాఠశాలలో రాష్ట్ర స్థాయి జీవ శాస్త్రం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో పరీక్ష పెట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాలను కలిగి ఉండాలని, మూఢనమ్మకాలను వీడాలన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులుగా రాణించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. జీవ శాస్త్రం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, కృష్టారావు, సురేష్, శ్రీరాం, సత్యనారాయణ, దేవేందర్, మారుతి, గంగాధర్, బాల్‌రాజ్, రాజేశ్వర్, మహేష్, లక్ష్మణ్‌సింగ్, రాజ్‌కుమార్, చిన్న స్వామి తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బాన్సువాడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మహాత్మాగాంధీ జ్యోతీబా పూలే పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వండి పెట్టే వంట సరుకులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసురావాలని సూచించారు. అనంతరం తిమ్మాపూర్‌లో రైతులతో మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీలత తదితరులు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులను ప్రారంభించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో జీపీ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ తండావాసులు శుక్రవారం ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెజుగంచెరువుతండా, ఎర్రకుంటతండాలను కలిపి నూతన జీపీగా ఏర్పాటు చేశారన్నారు. మొదటి నుంచి తమ తండాలోనే ఓ అద్దె భవనంలో గ్రామ పంచాయతీ కొనసాగుతుందని, జీపీ భవన నిర్మాణం కోసం గతంలోనే తండాకు చెందిన రమావత్ 11 గుంటల భూమిని ఇచ్చారన్నారు. ప్రస్తుతం తమ తండాకు మంజూరు చేసిన జీపీ భవన నిర్మాణ పనులను బెజుగంచెరువుతండాలో వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. సొసైటీ డైరెక్టర్ కిషన్ నాయక్, తదితరులున్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బెజుగంచెరువుతండావాసులు

బైలా యాక్ట్‌పై సంఘ సభ్యులకు అవగాహన



రాజంపేట: మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం గ్రామ సంఘం వీవోఏలకు సహాయ సహకార సంఘాల చట్టంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 1995 చట్టం ప్రకారం ఏర్పడిన సంఘాల ఉపనిధులపై(బైలా) సంఘ సభ్యులతో చర్చించారు. గ్రామ సంఘం మహాసభతో పాటు కార్యవర్గ, పాలక వర్గ సభ్యుల ఎంపిక ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు సాయిలు, శ్రీనివాస్ రమేష్ బాబయ్య, స్వామి పాల్గొన్నారు.

సమాచారం..

నేడు మంజీర కళాశాలలో మెగా జాబ్‌మేళా



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మంజీర డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ స్కిల్స్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ప్రముఖ ఎంఎస్‌ఎన్ లాబోరేటరీలో ఉద్యోగాల భర్తీ కోసం శనివారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆయన మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు హాజరై ఉద్యోగం పొందాలని కోరారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ తదితరులున్నారు.

నేడు, రేపు సత్యసాయి టెలీమెడిసిన్ సేవలు

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి సేవా సమితి ప్రాణ మిత్ర కార్యక్రమం కింద ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని రకాల వ్యాధులకు ఉచిత టెలీమెడిసిన్ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి సెంటర్ ప్రతినిధులు తెలిపారు. 080–47179 7997 నంబర్‌కు సంప్రదించవచ్చని, 24 మంది వైద్యులు అందుబాటులో ఉంటారని వారు పేర్కొన్నారు.

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

కామారెడ్డి అర్బన్: అంధుల కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టిన లుయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా ఈ నెల 4న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖాధికారి ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు జిల్లాలోని అంధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.